ప్రజాశక్తి

మంగళవారం 28 అక్టోబర్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

మరో రెండు రోజులు ఉత్కంఠ

- మొంథా తుపాను ప్రభావం వర్షంతో ఆరంభం
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సిఎం చంద్రబాబు ఆదేశం
- యంత్రాంగమంతా ఇదే పనిలో నిమగ్నం విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

తుపాను ఉత్కంఠ మరో రెండు రోజులు తప్పేలా లేదు. దీని ప్రభావం ఎంత మేరకు ఉంటుందనేది మంగళ, బుధవారాల్లో తేలనుంది. అప్పటి వరకూ ఉత్కంఠ తప్పదు. సోమవారం మధ్యాహ్నం నుంచే వాతావరణం మారిపోయింది. వర్షం మొదలైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావం సోమవారం మొదలైంది. రెండు రోజులుగా సిఎం చంద్రబాబు ఈ తుపానును చాలా సీరియస్‌గానే తీసుకున్నారు. వరుసగా వీడియో కాన్ఫరెన్సులు పెడుతూ కలెక్టర్లను అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగత్తలపైనా దిశానిర్దేశం చేస్తున్నారు. వాతావరణశాఖ నుంచి అందిన సమాచారం మేరకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగానే ఉంది. యంత్రాంగాన్ని రెండు రోజులుగా ఇదే పనిలోఉండాలని నిర్దేశించారు. దీంతో కలెక్టర్ మొదలు మండలస్థాయి అధికారుల వరకూ అందరూ తుఫానుపైనే దృష్టిపెట్టారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. భారీ వర్షాలు కురిస్తే ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సహాయక బృందాలు జిల్లాకు చేరుకున్నాయి. మరోవైపు జిల్లాలకు స్పెషలాఫీసర్లను నియమించారు. అధికారులు నిరంతరం సమీక్షలు చేస్తున్నారు. తీరప్రాంతాల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగత్తలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు స్పష్టంగా ఆదేశించారు.ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకంగా సూచించారు. బంగాళాఖాతంలో కొనసాగుతోన్న వాయుగుండం తీవ్ర తుఫానుగా మారి మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. ఈ రెండురోజుల్లోనే తుఫాను ముప్పు పొంచి ఉంది. సోమవారం నుంచే పాఠశాలలకు మూడు రోజులపాటు సెలవు ప్రకటించారు.విద్యార్థులను వాగుల వద్దకు వెళ్లకుండా జాగత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజబాబు తల్లిదండ్రులకు సూచించారు. మండలస్థాయి అధికారులు కూడా తుఫానుపై గ్రామాల్లో అప్రమత్తం చేశారు. వాగులు, వంకలు 2లో



శింగరాయకొండ మండలం పాకల వద్ద ఎగసి పడుతున్న అలలు

మొంథా తుపాను నేపథ్యంలో

నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు

బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

మొంథా తుపాను నేపత్యంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సమాచార పౌర సంబంధాల, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. తుపాను ప్రభావంపై జిల్లా అధికారులతో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుపాను విపత్తుని ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన వారిని తరలించాలన్నారు. తుపాను తగ్గేవరకూ మత్స్య కారులను సముద్రంలోకి అనుమతించ వద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరగకుండా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీక్షణ సమావేశం ద్వారా పరిస్థితులను సమీక్షిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించిన విషయాలను వివరించారు. చెరువులు, పంట కాల్వలు నిండి పంట పొలాల్లోకి నీరు చేరి జిల్లాలో నష్టం 2లో

చీరాల మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం

షోకాజ్ నోటీసు జారీ..?

7లో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- తీర ప్రాంత మండలాలపై ప్రత్యేక దృష్టి
- ముప్పును ఎదుర్కొనేందుకు సన్నద్ధం
- జిల్లా కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


మొంథా తుపాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. తుపాన్ ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లతో పూర్తి సన్నద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. ప్రకాశం భవనంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కలెక్టర్ పి. రాజాబాబు, సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసుతో కలిసి సోమవారం పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం రాత్రి నుంచి జిల్లాలో తుపాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సర్వ సన్నద్ధంగా ఉందన్నారు. తుపాన్ ప్రభావం లేదని ప్రజలు బయటకు రావద్దని, కొన్ని సార్లు అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు వచ్చి ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. మరి కొన్ని సార్లు ప్రాణ నష్టం కలిగే అవకాశం ఉందన్నారు.

తీర ప్రాంత మండలాలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. తీర ప్రాంత మండలాలైన సింగరాయ కొండ, టంగుటూరు, కొత్త పట్నం, నాగులుప్పలపాడు మండలాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎంత సమయంలో తరలిస్తున్నాం, చెట్లు పడిపోతే ఆ ప్రదేశాలకు ఎంత సమయంలో చేరుకుంటామనే విషయాలపై ట్రయిల్ రన్ నిర్వహించామన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్దంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే కలెక్టరేట్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటుచేసి సంబంధిత శాఖల నుండి ఒక సీనియర్ అధికారిని ఇందులో నియమించామన్నారు.

ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం

సోమవారం రాత్రి నుంచి మంగళ, బుధవారాలలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశ్చిమ ప్రకాశం ప్రాంత పరిధిలో ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ దూర ప్రాంత ప్రయాణాలు పెట్టుకోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తుఫాన్ నేపథ్యంలో 27 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీరు, భోజన వసతి, విద్యుత్ పోతే జనరేటర్స్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. జెసిబిలు, ట్రాక్టర్స్, పవర్ సాస్‌ను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలోని 799 మంచినీటి చెరువులలో 50 ట్యాంక్‌లు నిండి నీటి సామర్థ్యంతో ప్రమాదకర రీతిలో ఉండటంతో ప్రతి ట్యాంక్ వద్ద ఓ అధికారిని నియమించి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి స్వామి

త్వరలో మార్కాపురం జిల్లా

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

త్వరలో మార్కాపురం జిల్లా ఏర్పడుతుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శ్రీశైలం వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో కొద్దిసేపు దోర్నాలలో ఆగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాను ప్రభావం తీవ్రంగా ఉన్నందున ప్రజలు బయటికి రావద్దని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, వారికి ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా చేస్తానని హామీ ఇచ్చారని, అందులో భాగంగా తొందరలోనే జిల్లా ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామచర్ల పూర్ణ చంద్రరావు, టిడిపి మండల కన్వీనర్ షేక్ మాబు, శేషాద్రి, జంగిలి పిచ్చయ్య, పంచాయతీ సర్పంచి చిత్తూరు హారిక, సమ్మద్ బాషా, సమద్, ఈదర మల్లయ్య, బాషా, మౌలాలి, చెన్నారెడ్డి, గుండారెడ్డి, వెంగళరెడ్డి, నాగేంద్రబాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మొంథా తుపాను నేపథ్యంలో
నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

పెరిగే అవకాశం ఉందన్నారు. కల్వర్టుల వద్ద నీటి నిల్వలు తగ్గించాలన్నారు. పంటలకు నష్టం తగ్గించేలా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పునరావాస కేంద్రాలు వేగంగా ఏర్పాటు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి వేణు గోపాల్ రెడ్డి తెలిపారు. మురుగు నీరు ప్రవాహం దిగువకు వెళ్లడానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మొంథా తుఫాను ప్రభావంతో రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ బాపట్ల జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్ తెలిపారు. ఈనెల 28న రాత్రి సమయంలో కోనసీమ వద్ద తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందన్నారు. మంగళవారం 80 నుంచి 100 ఎంఎం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. విపత్తును సమర్థంగా ఎదుర్కోనేలా సహాయక చర్యలు సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ చెప్పారు.

ప్రాణ నష్టం జరగకుండా పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లాలో ఎన్‌డిఆర్ఎఫ్ బందాలు, క్విక్ రెస్పాన్స్ బందాలను సిద్ధంగా ఉంచామన్నారు. బీచ్ లను తాత్కాలికంగా మూత వేసినట్లు తెలిపారు. రహదారులపై వర్షం నీరు ప్రవహించే ప్రాంతాలను గుర్తించి ట్రాఫిక్ దారి మళ్లించే ఏర్పాట్లు చేశామన్నారు. పునరావాస కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, డిఆర్‌ఒ జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరో రెండు రోజులు ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

ప్రవహించే రహదారుల్లో రాకపోకలపైనా పోలీసులు దృష్టి సారి ంచారు. నిఘాలేనందున కొన్ని చోట్ల జనం వాగుల్లోకి దిగుతున్నారు. నీరు ప్రవహించే చప్టాలపైనా వాహనాలు నడుపుతున్నారు. రాకపోకలపైనే ఎక్కువగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా రానున్న రెండు రోజులు తుఫాను ముప్పును ఎదుర్కోవాల్సి ఉంది. జనం కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఎస్సీ హాస్టల్‌లో ఏఎస్‌డబ్ల్యూవో తనిఖీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో

సంతనూతలపాడులోని ఎస్సీ హాస్టల్‌ను ఏఎస్‌డబ్ల్యూవో రబియా బేగం, మండల విద్యాశాఖ అధికారి డి వెంకొరెడ్డితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. హాస్టల్లో 30 మంది విద్యార్థులకు గాను 16 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థులకు సంబంధించి వారి తల్లిదండ్రులతో ఏఎస్‌డబ్ల్యూవో రబియా బేగం ఫోన్లో మాట్లాడారు. విద్యాభివృద్ధిలో భాగంగా మీ పిల్లలు, విద్యార్థులను త్వరగా హాస్టల్‌కు పంపించాలని కోరారు. విద్యార్థులకు ఈ సందర్భంగా అవగాహన కలిగించారు. తుపానులో భాగంగా భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్ రవికి ఆమె సూచించారు. విద్యార్థులను విద్యా తదితర రంగాలు, వసతులపై ఏఎస్‌డబ్ల్యూఓ రబియా బేగం ప్రశ్నించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. హాస్టల్ నిర్వాహణపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్ రవి అధికారులకు విద్యార్థుల పనితీరు, వసతులపై వివరించారు.

పొదుపు మహిళలకు యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్వయం సహాయక సంఘాల సభ్యుల పొదుపు ఆర్థిక లావాదేవీల నిర్వహణ సక్రమంగా ఉండేలా ప్రభుత్వం మన డబ్బులు-మన లెక్కలు అనే యాప్ అందుబాటులోకి తెచ్చిందని ఏపిఎం పి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం పొదుపు మహిళలతో యాప్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఏపిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ సభ్యుల పొదుపులు, అప్పుల చెల్లింపుల వివరాలను ఎప్పటికప్పుడు ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలెసి మూల వెంకిరెడ్డి, సిసిలు ఇబ్రహీం, కాశయ్య, అకౌంటెంట్ మాధవి, సిఆర్‌పిలు, విఓఏ, మండల సమైక్య అధ్యక్షురాలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

ప్రజాశక్తి-మార్కాపురం



సప్లయ్ ఛానల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరావు

మొంథా తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు విజ్ఞప్తి చేశారు. తుపాను నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు పలు ప్రాంతాల్లోని మురుగు కాలువలు, చెరువుకు నీటిని సరఫరా చేసే సప్లయ్ ఛానల్ తదితరాలను సోమవారం పరిశీలించారు. నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. నీటి సరఫరా, వీధి దీపాలు నిర్వహణలో లోపాలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. నీటి నిల్వ అధికంగా ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మూడు షిఫ్టుల్లో మున్సిపల్ సిబ్బంది తుపాను సహాయక చర్యలు చేపట్టేందుకు అందుబాటులో ఉంటారన్నారు. ఏదైనా సమస్య తతెత్తిన సమయంలో మున్సిపల్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 9966339599, మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు 8474009441, రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు 9966622515 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం చేరవేయాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

'ఐలు' జిల్లా ప్రధాన కార్యదర్శి యాసిన్

ప్రజాశక్తి-మార్కాపురం

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని 'ఐలు' జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాసిన్ డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జెఎస్ఆర్ కృష్ణశాస్త్రి అధ్యక్షతన 'ఐలు' సమావేశం మార్కాపురంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి యాసిన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం న్యాయవాదులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని అన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలను మర్చిపోయారా అని ప్రశ్నించారు. జూనియర్ న్యాయవాదులకు శిక్షణ భృతి రూ.5 వేల నుంచి రూ.10 వేలు ఇవ్వాలన్నారు. ఆరోగ్య బీమా రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని కోరారు. డెత్ బెనిఫిట్స్ రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలుకు పెంచాలని సూచించారు. మహిళా న్యాయవాదులకు ప్రత్యేకంగా బార్ ఏర్పాటు చేయాలని కోరారు. కోర్టు ప్రాంగణంలో మహిళలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. అర్హత కలిగిన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పైన సూచించిన డిమాండ్లన్నీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలేనని, ఆ హామీలు అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఐలు తరుపున న్యాయవాదుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి డి ఏడుకొండలు, నాయకులు ఎస్‌కె మతిన్ బాషా, విజయకుమారి, కాశీశ్వరరావు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



'ఐలు' మార్కాపురం అధ్యక్షులు మతిన్ బాషా

'ఐలు' మార్కాపురం అధ్యక్షులుగా మతిన్ బాషా

మార్కాపురం 'ఐలు' నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా షేక్ మతిన్ బాషా నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా విజయకుమారి, పరశురాయిని రామ్, ప్రధాన కార్యదర్శిగా ఎం కాశీశ్వర్‌రావు, సహాయ కార్యదర్శులుగా జె మధు, ఎం రమేష్ నాయక్, కోశాధికారిగా దేవరకొండ గీత, సభ్యులుగా కె గురుదేవి, టి అలేఖ్యలు నియమితులైన వారిలో ఉన్నారు.

పంచారామాల సందర్శనకు...
మార్కాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-మార్కాపురం

కార్తీక మాసోత్సవం సందర్భంగా కోటి సోమవారం, కార్తీక సోమవారాల్లో పంచారామాలను సందర్శించే యాత్రికుల కోసం మార్కాపురం ఆర్‌టిసి డిపో నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మార్కాపురం డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులు సోమవారం తెలిపారు. ఒకే రోజులో గుంటూరు జిల్లాలోని అమరారామం, పశ్చిమ గోదావరి జిల్లాలోని సోమరామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారారామం క్షేత్రాలను సందర్శించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రయాణానికి అనువుగా ఉండే అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కొక్కరికి రూ.2,150 చార్జీ ఉంటుందని తెలిపారు. దీంతో పాటు అరుణాచలం, భైరవకోన, మహానంది, శ్రీశైలం యాత్రా స్థలాలకు అద్దె ప్రాతిపదికపైన బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



విరాళం ప్రకటిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఆర్మీ మెమోరియల్ భవన నిర్మాణానికి
ఎమ్మెల్యే ముత్తుముల విరాళం

ప్రజాశక్తి-రాచర్ల: రాచర్ల మండలం, ఆకవీడు గ్రామంలో నిర్మించనున్న ఆర్మీ మెమోరియల్ భవన నిర్మాణానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తు ముల అశోక్‌రెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటిం చారు. చోళవీడు గ్రామంలో సోమవారం వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను రాచర్ల మండల మాజీ సైనికుల సంఘ సభ్యులు కలిసి ఆర్మీ మెమోరియల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరగా తక్షణమే స్పందిం చిన ఎమ్మెల్యే తనవంతు విరాళం ప్రకటించారు. ప్రభుత్వం నుంచి కూడా సహకారం అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు గుమ్మళ్ల అంకయ్య, సెక్రటరీ నీలి రామకృష్ణ, ట్రెజరర్ గువ్వా ఆంజనేయులు, మాజీ సైనికులు నిబ్బరగండ్ల రామచంద్రారెడ్డి, గువ్వా పిచ్చయ్య, లాజర్, కోటా రామసుబ్బారెడ్డి, డేవిడ్, చిన్న అంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ లింక్ డాకుమెంట్స్ పోయినవి

ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, కొమరోలు గ్రామానికి చెందిన కామూరి ప్రభావతి భర్త కామూరి రమణారెడ్డి కు చెందిన కోమరోలు మండలం కొమరోలు పంచాయతీ లోని బావాపురం రోడ్డులోని స్థలానికి సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్లకు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ పోయినవి. లింక్ డాక్యుమెంట్స్ నెంబర్లు 1599/2007 మరియు 1266/1994 జిరాక్స్ తీయించుకునేందుకు ఇంటివద్ద నుండి జిరాక్స్ షాపుకు వెళ్ళు సమయంలో మార్గమధ్యలో పోయినవి. వెతికినా కనిపించలేదు. ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

ఇట్లు
కామూరి ప్రభావతి
సెల్ 9160796839

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, ఒంగోలు
OS NO 160/2024

అన్నవరపు అనిత ...వాది

మరియు

చీదెళ్ల అర్జునరావు ...ప్రతివాది

To,
ప్రతివాది
చీదెళ్ల అర్జునరావు,
తండ్రి శివరావు,R/o: B మాచవరం గ్రామం & పోస్టు, సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో పిటిషనర్/ వాది తనకు రావలసిన సొమ్మును రాబట్టుకొనుటకు కోర్టులో మీపై దావా వేయగా మీ నోటీసు కొరకు ఉన్నందున మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా మరియు పోస్ట్ ద్వారా నోటీసులు పంపినను మీరు తీసుకోనందున కోర్టు వారు పత్రికా ముఖంగా మీకు తెలియజేయ వలసిందిగా ఆర్డర్ వేసియున్నారు వాయిదా తేదీ 05.11.2025 న ఉన్నందున మీరు గాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని ఉదయం గం॥10:30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయును లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు
MVVS వేణుగోపాల్,
అడ్వకేట్,
ఒంగోలు, సెల్ 949466265

కంభంలో
హాస్టళ్ల పరిశీలన

ప్రజాశక్తి-కంభం రూరల్

మండలంలోని పలు హాస్టళ్లను ఎంఈవో-2 శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొంథా తుపాను నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మూడు రోజులపాటు హాస్టల్ నుంచి బయటకు వెళ్లవద్దని, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఆర్పిలు, డేటాఎంట్రీ ఆపరేటర్ శేఖర్, కాశీరావు ఉన్నారు.

మహారాజశ్రీ ఒకటవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
EP 61/2016 IN OS 139/2012

కోటపాటి తిరుపతిరెడ్డి ...D.H.R

మరియు

1. సూరసాని కాశిరెడ్డి (డైడ్)
2. సూరసాని ఈశ్వరమ్మ వగైరాలు ...JDRs

వేలం ప్రకటన

పై నెంబరు ఇపిలో D.H.R తనకు రావాల్సిన డిక్రీ బాకీ మొత్తమును J.D.Rs నుండి వసూలుకు గాను క్రింది షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి జప్తు చేయించి సదరు ఆస్తిని వేలం వేయించుట ద్వారా బాకి రాబట్టుకొనుటకు పై EP దాఖలు చేయడమైనది. పై తెలిపిన కోర్టు వారు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని తేది 07.11.2025 ఉదయం 10.30 గంటలకు ఒంగోలు ఒకటవ జిల్లా జడ్జి వారి కోర్టులో బహిరంగ వేలం జరుపగలందుకు ఉత్తర్వులు జారీ చేసి యున్నారు. సదరు ఆస్తిని వేలంలో కొనదలచిన వారు ఆరోజున పై తెలిపిన కోర్టులో హాజరై వేలంలో పాల్గొనవచ్చునని ఇందు మూలంగా యావన్మందికితెలియజేడమైనది.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా - మార్కాపురం రిజిస్ట్రేషన్, కనిగిరి సబ్ రిజిస్ట్రేషన్ - కనిగిరి రెవెన్యూ మరియు మండలం - సర్వే నెం. 426లో ఎ.06-41 సెంట్లు మరియు సర్వేనెంబరు 410లో ఎ.3-38 సెంట్లు వెరసి మొత్తం ఎ.9.79 సెంట్లు ఏక ప్రదేశం కలిగిన ఆస్తిలో 1వ అయిటం (ఎ) ప్రయివేటు లేఅవుట్ ప్రకారం ప్లాట్ నెం. 72,73,74,79,80 మరియు 81
తూర్పు: దేవిరెడ్డి రామమోహన్‌రెడ్డి అమ్మిన ఆస్తి
దక్షిణం: 18 అడుగుల వెడల్పుగల రోడ్డు.
పడమర: 2వ అయిటం.
ఉత్తరం: 18 అడుగుల వెడల్పుగల రోడ్డు.
పై నాలుగు హద్దుల్లో 1440 చదరపు గజాలు లేక 1204.2చదరపుమీటర్లు, లేక ఎ.0.297 సెంట్లు విస్తీర్ణం.
(బి) ప్రయివేటు లేఅవుట్ ప్రకారం ప్లాట్ నెం. 90 మరియు 91
తూర్పు: దేవిరెడ్డి రామమోహన్ రెడ్డి అమ్మిన ఆస్థి.
దక్షిణం: 18 అడుగుల వెడల్పుగల రోడ్డు.
పడమర: జెడిఆర్‌ల తాలూకు ఆస్తి.
ఉత్తరం: పాపసాని కృష్ణారెడ్డి అమ్మిన ఆస్తి.
పై నాలుగు హద్దుల మధ్య 448 చదరపు గజాలు లేక 374.64 చదరపుమీటర్లు, లేక ఎ.0.093 సెంట్లు విస్తీర్ణం మొత్తం విస్తీర్ణం (A+B) 1888 చదరపు గజాలు లేక 1578 చదరపు మీటర్లు లేక ఎ.0.39 సెంట్లు.
డిహెచ్ఆర్ విలువ: రూ. 7,56,000/-
అమీనా విలువ: రూ. 9,00,000/-
2వ అయిటం: (ఎ) ప్రయివేటు లేఅవుట్ ప్రకారం ప్లాట్ నెం. 75.77, మరియు 78
తూర్పు: జెడిఆర్స్ తాలుకు ఆస్తి
దక్షిణం: 18 అడుగుల వెడల్పు గల రోడ్డు.
పడమర: 18 అడుగుల వెడల్పు గల రోడ్డు మరియు తమ్మినేని చిన్నరామిరెడ్డి ఫ్లాట్ నెం. 76 కొంత వరకు మరియు ఇతరుల ఆస్తి కొంతవరకు.
ఉత్తరం: 18 అడుగుల వెడల్పు గల రోడ్డు.
పై నాలుగు హద్దుల్లో 1346.66 చదరపు గజాలు లేక 1126.15 చదరపుమీటర్లు లేక ఎ.0.278 సెంట్లు విస్తీర్ణం.
(బి) ప్రయివేటు లేఅవుట్ ప్రకారం ప్లాట్ నెం.92,93 మరియు 94కు హద్దులు
తూర్పు: జెడిఆర్స్ తాలుకు ఆస్తి.
దక్షిణం: 18 అడుగుల వెడల్పుగల రోడ్డు.
పడమర: జెడిఆర్స్ తాలుకు ఆస్తి.
ఉత్తరం: పాపసాని కృష్ణారెడ్డి అమ్మిన ఆస్తి.
పై నాలుగు హద్దుల్లో 638.42 చదరపు గజాలు లేక 533.88 చదరపు మీటర్లు, లేక ఎ.0.13 సెంట్లు విస్తీర్ణం. (మొత్తం విస్తీర్ణం (A+B) 1985.08 చదరపు గజాలు లేక 1602.02 చదరపు మీటర్లు లేక ఎ.0.41 సెంట్లు)
డిహెచ్ఆర్ విలువ: రూ. 7,95,000/-
అమీనా విలువ: రూ. 9,50,000/-
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వేలం తేది: 07-11-2025
ఒంగోలు
తేది: 27-10-2025

గుడ్డదొన చంద్రశేఖర్,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

సూపర్ జీఎస్టీ..
సూపర్ మోసమే

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-దొనకొండ

సూపర్ జీఎస్టీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రచారం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. సీపీఎం మండల నాయకులతో కుందుర్తి చిన్న నర్సింహులు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 22న కేంద్రం జీఎస్టీ-2 పేరుతో ప్రజలకు పన్నుల భారం నుంచి పెద్ద ఉపశమనం కల్పిస్తున్నట్లు ప్రచారం ప్రారంభించిందన్నారు. ఇది సూపర్ మోసంగా ఉందన్నారు. సూపర్ జీఎస్టీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు చొప్పున ఆదా అవుతుందని చెబుతున్న ప్రభుత్వం గడచిన 8 ఏళ్లుగా ఆ మోతాదులో ప్రజల మీద భారాలు మోపిన మాట ఒప్పుకోవటమేనన్నారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నాడు ఇచ్చిన వాగ్దానాలతో 50 ఏళ్లకే పింఛన్, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న ఆడబిడ్డ పథకం, ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగులందరికీ భృతిలాంటి హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కర్ణా కృష్ణా, కోలా కిరణ్‌కుమార్, కురవటి రామయ్య, మేళం ఉదయ్, ఎర్రగుంట్ల నతాన్ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో యాచకుడు దారుణ హత్య

ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘటన

ప్రజాశక్తి-చీరాల

యాచకుడిపై దాడికి పాల్పడి దారుణంగా హత్య చేసిన సంఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రహదారి వద్ద సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. చీరాల మండలం సాయి కాలనీలో నివాసం ఉంటున్న దామర్ల వెంకటేశ్వర్లు (68) యాచకుడిగా తిరుగుతుంటాడు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని దుండగులు అతనిపై దాడి చేసి హత్య చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఒకటో పట్టణ సీఐ సుబ్బారావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. యాచకుడి తలపై బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని వద్ద ఏటీఎం కార్డులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా హత్య చేశారా? లేక గంజాయి, మద్యం మత్తులో దుండగులు దాడిచేసి హతమార్చారా? అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

కె.పల్లెపాలెంలో ఎమ్మెల్యే దామచర్ల పర్యటన

ప్రజాశక్తి-కొత్తపట్నం

మొంథా తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులకు, తీర ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. సోమవారం సాయంత్రం తుఫాన్ ప్రభావాన్ని తెలుసుకునేందుకు ఎమ్మెల్యే దామచర్ల కె.పల్లెపాలెం బీచ్ సందర్శించి మత్స్యకారుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి బియ్యం ప్రతి కుటుంబానికి అందిస్తామన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లడం లేదని వారి జీవనం దుర్భరంగా ఉందని, ప్రభుత్వం తుఫాన్ సమయంలో మత్స్య కారులను ఆదుకోవడం కోసం ప్రతి కుటుంబానికి ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నామన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పిడి టి.నారాయణ మండల స్థాయి అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, ఒకటవ రెండవ పట్టణ సిఐలు జగదీష్, మేడా శ్రీనివాసరావు, తహశీల్దార్ కె.శాంతి, ఎంపీడీవో శ్రీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, ఏవో కిషోర్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణ రెడ్డి, ఎస్సై వి.సుధాకర్, మత్స్య శాఖ జెడి శ్రీనివాసరావు, ఏడిఎస్ శ్రీనివాసరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

తీరంలో ఎగిసిపడుతున్న అలలు

పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి-శింగరాయకొండ

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను తాకిడికి శింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. పాకల, ఊళ్లపాలెం సముద్ర తీరంలో సోమవారం ఉదయం ప్రశాంతంగా ఉంది. అయితే మధ్యాహ్నం తర్వాత అలలు ఉధృతి ఒక్కసారిగా పెరిగిపోయింది. తుఫాను కారణంగా వర్షం కూడా మొదలకావడంతో దీనికి తోడు సముద్ర తీరంలో అలలు ఉధృతి గంటగంటకూ పెరుగుతోంది. శింగరాయకొండ మండలంలో గ్రామాల్లో తుఫాను ఎదుర్కొనేందుకు మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో చిరంజీవి, తహశీల్దార్ ఎన్‌విబి రాజేష్, ఎంపీడీవో డి.జయమణి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలను తరలించేందుకు ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేశారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు పాకల సముద్ర తీరాన్ని పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడారు. సముద్రంలో ఎవరూ వేటకు వెళ్ళరాదని సూచించారు. పాకల సర్పంచ్ చంద్రశేఖర్‌తో మాట్లాడి అక్కడ ఉన్న మత్స్యకారులకు అవగాహన కల్పించారు. వీరి వెంట ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాస్, సీఐలు హజరత్తయ్య, ఎస్కే ఖాజావలి, జి.సోమశేఖర్, ఎస్సైలు బి.మహేంద్ర, వి.నాగమల్లేశ్వర రావు, జి.కోటయ్య, హనుక్, మత్స్య శాఖ అధికారి వర్షిని, విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసరావు, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఆర్ఐ ప్రసాదు, కార్యదర్శి సుభాని, డిప్యూటీ ఎంపీడీవో రమేష్ బాబు తదితరులు ఉన్నారు.


ఉప్పుగుండూరులో నీటితో నిండిన పొలాలు


పాకల సముద్ర తీరంలో పర్యటిస్తున్న ఎస్పీ

లోతట్టు ప్రాంతాలు జలమయం

నాగులుప్పలపాడు: వాయుగుండం ప్రభావంతో పడుతున్న వర్షాలకు వాగులు వంకల పొంగి ప్రవహించడంతో పాటు లోతట్టు ప్రాంతాల జలమయమయ్యాయి. దాని నుంచి తేరుకొనే లోపే మొంథా తుపాన్ ప్రభావంతో మళ్ళీ ఎడతెరిపి లేని వర్షం మొదలవడంతో కొత్తకోట, హనమాపురం, మట్టిగుంట వాగులు పొంగి పొర్లుతున్నాయి. మొక్కజొన్న, సజ్జ, మిరప, మినుము, వరి, తదిర పంటలు ఉరకెత్తుతాయని రైతాంగం ఆందోళన చెందుతున్నారు తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో రవికుమార్ , పోలీస్ శాఖ అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

రైతుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తా

రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్‌గా మండవ జయంత్ బాబు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-మద్దిపాడు

రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తానని ఏపీ రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు తెలిపారు. సోమవారం ఒంగోలులోని సమైక్య కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ జయంత్ బాబు మాట్లాడుతూ రైతు కష్టపడి పండించే పంటలో వేలాది కుటుంబాల జీవనం దాగి ఉంటుందన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వారికి సరైన మార్కెట్ ధర లభించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ముందుగా జయంత్ బాబు దంపతులను పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. సమాఖ్య ఎండి నర్రా సురేంద్ర జయంత్ బాబు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా డైరెక్టర్లుగా కోమటినేని వీరభద్రరావు, మాచవరపు జాన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ వేడుకకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై జయంత్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమములో సమాఖ్య సీఈఓ జి.హరనాధ్, మాజీ అధ్యక్షులు చుంచు శేషయ్య, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ మండవ రంగారావు, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ కామేపల్లి శ్రీనివాసరావు, సమాఖ్య మాజీ డైరెక్టర్లు మండవ నరసింహారావు, మండవ రవి, సమాఖ్య మాజీ ఉపాధ్యక్షులు అబ్బూరి శేషగిరి రావు, గోల్డెన్ గ్రానైట్స్ మండవ రవి, సంతనూతలపాడు మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, గొల్లపూడి సుబ్బారావు, మండవ మురళి, రైతులు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మండవ జయంత్ బాబు


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

14 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగల్ టీం, సిబ్బంది మరియు పోలీసు జాగిలంతో సోమవారం పలురైళ్లలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన పార్శిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు మరియు ఇతర వస్తువులను తనిఖీ చేశారు. ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్‌లో సుమారు 14 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిసాకి చెందిన ఆనంద్ రాణా, మిలు మాతాలిలను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు కోసం జి.ఆర్.పి. పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీలో మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్, ఎస్సైలు శివ రామయ్య, చెంచయ్య, జి.ఆర్.పి ఎస్సై మధుసూధనరావు,ఈగల్ టీం,స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పట్ల ఎంఈవో నిరంకుశ వైఖరి : యుటిఎఫ్

ప్రజాశక్తి-దొనకొండ : దొనకొండ మండల విద్యాశాఖాధికారి-1 సాంబశివరావు మండలంలోని ఉపాధ్యాయుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను కూడా తుంగలో తొక్కుతున్నారని యూ టిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓవీ వీరారెడ్డి ఆరోపించారు. స్థానిక యూటిఎఫ్ కార్యాలయంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాభివృద్ధికి తోడ్పడకుండా ఏకపక్ష ధోరణిలో వ్యవహరిస్తున్నాడని ఉపాధ్యాయుల పట్ల ఎంఈవో సాంబశివరావు అనుసరిస్తున్న వైఖరిని యూటిఎఫ్ మండల శాఖ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.రాజశేఖర్ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రిలీవింగ్ విషయంలో డీఈవో ఆదేశాలు పట్టించుకోకుండా తన ఇష్ట మొచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీను మాట్లాడుతూ అధికారులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా విద్యాభివృద్ధికి కృషి చేయాల్సి ఉండగా దొనకొండ ఎంఈవో-1 దానికి విరుద్ధంగా తన మాటే శాసనం అన్నట్లు వ్యవహరించటం మంచిది కాదని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి.అంజీ నాయక్, సహధ్యక్షులు పి.శేషగిరి, గౌరవాధ్యక్షులు కటారు వెంకటేశ్వర్లు, కోశాధికారి పి.నాగరాజు, సీనియర్ నాయకులు ఆదిమూలపు ప్రభుదాస్, కె.విల్సన్, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న తహశీల్దార్, సిఐటియు నాయకులు

సిఐటియు జిల్లా మహాసభల లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి : దర్శిలో నవంబరు 8, 9 తేదీలలో జరుగుతున్న సిఐటియు ప్రకాశం జిల్లా 13వ మహాసభల లోగోను తహశీల్దార్ మామిళ్ళపల్లి శ్రావణ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శిలో మొదటిసారిగా జరుగుతున్న ఈ మహాసభలను జయప్రధం కావాలని అకాంక్షించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ దర్శి పిజిఎన్ కళ్యాణమండపంలో ప్రతినిధుల సభకి జిల్లా అన్ని ప్రాంతాలకి యూనియన్లుకి ప్రాతినిధ్యం వహిస్తూ 300 మంది హాజరౌతారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు దర్శి నియోజకవర్గ నాయకులు తాండవ రంగారావు, ఉప్పు నారాయణ, తోట తిరుపతిరావు, కెవి.పిచ్చయ్య, సిహెచ్.ఆదినారాయణ, ఈమని నాగేశ్వరరావు, ఎల్ఐసి నాయకులు కాలేబాషా, ఆర్.రామ్‌కోటిరెడ్డి పాల్గొన్నారు.

శనగలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

రైతు నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఇంకొల్లు

శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న ఐదు లక్షల క్వింటాల ఎర్ర, తెల్ల శనగలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సెనగ రైతుల సదస్సులో రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ సంస్థను రంగంలోకి దింపాలని కోరారు. గత నాలుగేళ్లుగా నష్టపోతున్న శనగ రైతులకు ప్రభుత్వం అండగా నిలబడి ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గిడ్డంగల్లోని శనగలు వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణంలో శనగ రైతుల సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు రైతు సంఘం నాయకులు అన్నం ఆదియ అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ జిల్లాలో ఐదు లక్షల క్వింటాళ్ల తెల్ల, ఎర్ర శనగలు శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్నట్లు తెలిపారు. వాటిని వెంటనే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రాంకోటేశ్వరావు మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీల్లోని శనగలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని అన్నారు. మరలా సెనగ పంట వేసుకునే సమయం వచ్చిందని అన్నారు. గత10ఏళ్ల క్రితం రైతు సంఘం ఆందోళనతో ఎర్ర శనగలు



మాట్లాడుతున్న కందిమళ్ల రామ కోటేశ్వరరావు

క్వింటాకు రూ.7600 ధర లభించిందని అన్నారు. తెల్ల శనగలు రూ.10వేలు పలికిందని అన్నారు. ఈ సంవత్సరం ఎర్ర శనగలు రూ.8వేలకు, తెల్ల శనగలు రూ.10 వేలకు కొనాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శనగలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తోపాటు రాష్ట్రంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలు ఏవైనా రైతులకు మేలు చేయడం లేదని తెలిపారు. మాటలతో కాలయాపన చేస్తూ రైతులను ఇబ్బందులు పడుతున్న సంఘటనలే జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో ఇదే సమస్య ఉందని తెలిపారు. తక్షణమే వ్యవసాయ శాఖ కమిషనరేట్ కలుగజేసుకొని మద్దతు ధర పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సదస్సులో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య మాట్లాడుతూ వ్యవసాయాన్ని దివాలా తీసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. అన్నీ ప్రైవేటుకు ఇచ్చే విధంగా వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు రైతులను ఇబ్బంది పెడుతుందని వివరించారు. గతేడాది అధికంగా కౌలు రైతులు పొగాకు వేసి నష్టపోయారని, ఈ ఏడు కౌలుకు తీసుకునే వారు తగ్గిపోయారని తెలిపారు. ఈపాటికే తీసుకున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పెట్టుబడి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కౌలు రైతు సమస్యలపై వచ్చేనెల 3న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని తెలిపారు. కౌలు రైతులు తరలి రావాలని కోరారు. అనంతరం 15మందితో శనగ రైతుల నూతన కమిటీ ఎన్నుకున్నారు. సదస్సు అధ్యక్షులు అన్నం ఆదియ మాట్లాడుతూ నవంబర్ 5న ఇంకొల్లు రైతు సంఘం మహాసభ, 15న రైతు సంఘం జిల్లా మహాసభ జరుగుతాదని తెలిపారు. ఈ మహాసభకు రైతులు రావాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఎర్రం గోవింద్ రెడ్డి, బొగ్గవరపు శంకర్రావు, కృష్ణమూర్తి, పేర్ని నాగేశ్వరరావు, పేర్ని నాగేశ్వరరావు, పెండ్యాల రామలింగస్వామి, జవహర్, మానం సుబ్బారావు, కర్రి రాధాకృష్ణమూర్తి, వడవల్లి కోటయ్య, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి నల్లతోటి భాను ప్రసాద్, కస్సుర్తి గంగయ్య , సిపిఎం మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - పంగులూరు

మొంతా తుఫాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరంలోని టిడిపి కార్యాలయంలో కార్యకర్తలు, అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. తుఫాను కారణంగా విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డిఈ మస్తానరావును కోరారు. అనేక చోట్ల స్తంభాలు పడిపోవటం, కరెంట్ తీగలు తెగిపోవడం, చెట్లు పడిపోవటం వంటి కారణాలతో విద్యుత్ అంతరాయం కలుగుతుందని చెప్పారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో అలాంటి సమస్యలు అధిగమించవచ్చని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని కోరారు. నియోజవర్గంలోని 78మందికి సిఎం సహాయ నిధి చెక్కులు, ఎల్ఓసిలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చీరాల మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అత్యవసరమైతేనే బయటకు రావాలి

ప్రజాశక్తి - చీరాల

తుఫాను తీవ్రత దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంఎల్ఎ కొండయ్య సూచించారు. రాబోయే రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. పట్టణంలో వర్షాల ప్రభావిత ప్రాంతాలు పరిశీలించారు. 31వ వార్డు రోశయ్య కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, పిహెచ్‌సిని, దండుబాట లోతట్టు ప్రాంతంలో నీటిని తొలగించే ప్రాంతాన్ని, వైకుంఠపురంలో రేషన్ షాప్‌ను పరిశీలించారు. ఛైర్మన్ మించాల సాంబశివరావు, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, కమిషనర్ మహ్మద్ రసీద్, తహశీల్దారు గోపీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేకల ప్రసాద్

జీవన పరిస్థితులు కాపాడుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

తరతరాల శ్రమజీవుల ద్వారా అందిన జీవన పరిస్థితులను కాపాడుకోవడమే మన ముందున్న కర్తవ్యమని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్లో జరిగిన కామ్రేడ్ బెజ్జం శ్రీనివాసరావు (శీనన్న) 7వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బెజ్జం శ్రీనివాసరావు మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన మార్గంలో శ్రమజీవుల విముక్తి పోరాటాలు నడిపిన నాయకుడని అన్నారు. ఆయన అకాల మరణం విప్లవ ఉద్యమానికి పూడ్చలేని లోటని అన్నారు. సభలో రూతమ్మ, బి లాజర్, మర్రిపూడి పద్మ, మువ్వల పల్లవి, రాఘవులు, విజయ్, వి లక్ష్మి, మాసిపోగు మరియమ్మ, దుప్పలపూడి మరియమ్మ పాల్గొన్నారు.

జానపద సాహిత్యంలో కొసరాజు స్థానం సుస్థిరం

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు జానపద సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన విలక్షణ కవి కొసరాజు రాఘవయ్య చౌదరని సాహితి భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. ప్రఖ్యాత సినీ రచయిత కవి కొసరాజు రాఘవయ్య చౌదరి 39వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తెలుగు సినీ సాహిత్యంలో జానపద ఒరవడికి శ్రీకారం చుట్టిన జానపద కవి సార్వభౌమునిగా కొసరాజు సాహిత్య ప్రస్థానంలో తమ స్థానం సుస్థిరం చేసుకున్నారని అన్నారు. కర్లపాలెం మండలంలో చింతాయపాలెంలో జన్మించిన కొసరాజు అప్పికట్లలో విద్యాబుద్ధులు నేర్చుకున్నారని అన్నారు. కొసరాజు 200చిత్రాలకు వెయ్యిపైగా పాటలు రాశారని అన్నారు. 12ఏళ్ళ వయసులోనే అష్టావధానాలు చేసి బాల కవిగా తెలుగు సాహిత్య లోకంలో చెరగని ముద్రలు వేశారని అన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ తెలుగు సినిమాలకు ఆయన రాసిన జయంబు నిశ్చయంబురా, మత్తు వదలరా


నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

నిద్దుర, ఏరువాకా సాగారో, ఏ నిముషానికి ఏమి జరుగునో, సరదా సరదా సిగరెట్టు, అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే, ఇల్లరికంలో ఉన్న మజా వంటి అద్భుత గీతాలు తెలుగు సినీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని అన్నారు. కార్యక్రమంలో మాల్యాద్రిరావు, దగ్గుమల్లి శామ్యూల్, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీ రామచంద్రమూర్తి, కామరాజు కాళిదాసు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వేటపాలెం

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలైన రామాపురం, నాయనపల్లి, కటారివారిపాలెం, అబ్దుల్ కలాం కాలనీ పునరావాస కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం ఏర్పాటు చేసిన వసతి, ఆహారం, తాగునీటి వంటి సదుపాయాలు పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆహార పదార్థాలు, తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. తుఫాన్ సమయంలో సమన్వయంతో


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ టి చంద్రశేఖర్ నాయుడు, ఎంఎంసి చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, తహశీల్దారు జి గీతారాణి, ఎంపిడిఓ మెడబలిమి రాజేష్ బాబు, ఎపిఎం కాటి అంజిబాబు, పంచాయతీ కార్యదర్శి వై సంపత్ కుమార్, నాయకులు కీర్తి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

తుఫాన్ ప్రభావం దృష్ట్యా విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ డీఈఈ ఎన్ సురేష్ బాబు సూచించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నేత అనగాని శివప్రసాద్ ఆదేశాల మేరకు


మాట్లాడుతున్న డిఇఇ ఎన్ సురేష్‌బాబు

నిజాంపట్నం, చెరుకుపల్లి, నగరం మండలాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. విద్యుత్ స్తంభాలు పడిపోవడం, తీగలు తెగడం వంటి ప్రమాదాలు జరిగితే వెంటనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.


గ్రైండర్ బహూకరిస్తున్న శేషారావు

అన్నదాన సత్రానికి గ్రైండర్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ క్షేత్రంలో కొలువైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నందు అన్నదాన సత్రానికి ఒక గ్రైండర్‌ను వసుంధర సిల్క్స్ అధినేత పబ్బిశెట్టి శేషారావు అందజేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మ నాయుడు తెలిపారు. పాలకమండలి చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు ద్వారా అందజేశారు.

చెన్నారెడ్డికి అభినందన

ప్రజాశక్తి - సంతమాగులూరు

వైసిపి రైతు విభాగం జిల్లా కమిటీకి అద్దంకి నియోజకవర్గం నుండి రైతు విభాగం కార్యనిర్వక సభ్యులుగా మండలంలోని వెల్లలచెరువుకు చెందిన కేసరి చెన్నారెడ్డి ఎన్నికయ్యారు. వైసిపి ఇన్‌చార్జి చింతలపూడి అశోక్ కుమార్ సోమవారం అభినందనలు తెలిపారు. రైతు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని పలువురు ఎస్సీ సెల్, బిసి, నాయకులు పోపూరి వెంకయ్య, భాష, బ్రహ్మారావు, బండి కోటిరెడ్డి పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో పాల్గొంటాం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి మొంథా తుఫాను సహాయక చర్యల్లో తాము పాల్గొంటామని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. ఆసక్తిగల మాజీ సైనిక ఉద్యోగుల పేర్లు జాబితా జిల్లా అధికార యంత్రాంగానికి అందజేస్తామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి షేక్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

తుఫాన్ నేపథ్యంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డి దేవరాజ్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్ర సిబ్బంది, రక్త నమూనా ల్యాబ్, మందులు నిల్వలు, తుఫానుకు అవసరమైన మందులు, సిబ్బంది హాజరు వంటివి పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ కె నరసింహారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, వైద్య సిబ్బంది ఉన్నారు

లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

మొంథా తుఫాను నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించేలా యుద్ధ ప్రాతిపదికన పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా అధికారులకు వీక్షణ సమావేశం ద్వారా సోమవారం పలు సూచనలు చేశారు.తుఫాను కారణంగా ప్రాణ నష్టం కలుగుకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారుజ ఐదు నియోజకవర్గాలలోని 944 నివాస ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలోని వారి కోసం ప్రభుత్వ పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో 1,547 మంది గర్భిణులు, బాలింతలను గుర్తించామని తక్షణమే వారి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అత్యవసర పరిస్థితులు నెలకొన్న దష్త్యా అధిక వర్షాలు కురిసే జిల్లాలోని 20 మండలాలకు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క మండలానికి మూడు చొప్పున మొత్తం 60 బస్సులను మండల కేంద్రాలలో సిద్ధంగా ఉంచాలన్నారు. సచివాలయాల వద్ద జెసిబి యంత్రాలు, చెట్లు పడితే తొలగించడానికి కోత యంత్రాలను సిద్ధంగా ఉంచాలన్నారు. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో డ్రోన్లు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రత్యేక అధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.భావన, డి ఆర్ఓ జి.గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

తుపాను పరిస్థితులు

ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన విధంగా చర్యలు తీసుకునేలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి. రాజాబాబు కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు.కలెక్టర్ రాజాబాబు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల్ కృష్ణతో కలసి ఒంగోలు కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మొంథా తుఫాన్ కంట్రోల్ రూమ్ ను సోమవారం సందర్శించారు. తుఫాన్ వివరాలను సంబంధిత శాఖల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అందుకు తగినట్లుగా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, విపత్తు నివారణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.మాధురి, కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి- టంగుటూరు

తుపాను తగ్గేవరకూ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మొంథా తుపానుపై ప్రకాశం, విశాఖ జిల్లాల కలెక్టర్లతో మంత్రి స్వామి సోమవారం సమీక్షించారు. కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి తుపాను ప్రభావం, అధికార యంత్రాంగం ఏర్పాట్లు గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తుపాను సిఎం చంద్రబాబు నాయుడు నిరంతరం సమీక్షిస్తున్నారు. తుపాను తగ్గేవరకూ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి. అంటు వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో నీరు, ఆహారం, పాలు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, జాగ్రత్తగా ఉండాలని మంత్రి తెలిపారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్ : సిఎస్‌పురంలోని ఓ పేద కుటుంబానికి సేవాసదన్ సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. గ్రామానికి చెందిన గుట్టం పద్మకు వృద్ధాప్య పెన్షను రావడంలేదు. ఆమెకు వృద్ధ తల్లికూడా ఉంది. కుమారుడు ఇటీవలే చనిపోయాడు. కుమార్తై ఉంది. కూతురు భర్త కూడా చనిపోయాడు. ఆమెకు కూడా పెన్షను రావడంలేదు. ముగ్గురు మహిళలకు ఆరోగ్యం బాగాలేదు. ఈ నేపథ్యంలో జెడ్పిహెచ్‌ఎస్‌లో ఎస్ఎ తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సేవా సదన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి మాల్యాద్రి వారికి రూ.6,600 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాసదన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గేదెల శంకర్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కట్టాఏసునాదం, నూకసాని గంగాధర్, సిపిఎం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీచ్‌లు మూసివేత

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా లో తుపాను ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో బీచ్‌లకు ఈ నెల 30 వరకూ మూసి వేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. తుపాను ప్రభావం మంగళవారం, బుధవారం ఎక్కువగా ఉంటుందని ఎవరూ సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవు బీచ్, రామాపురం బీచ్‌లతో జిల్లాలో ఉన్న అన్ని బీచ్ లకు రాకూడదని కలెక్టర్ తెలిపారు. బీచ్‌ల వద్దకు ఎవరూ రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ బీచ్‌లను మూసి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మొంథా తుఫాను నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అధికారులను ఆదేశించారు. ఒంగోలు నగరంలోని లోతట్టు ప్రాతం కొప్పోలులో మురుగునీరు ప్రవాహ ప్రాంతాన్ని అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాను తీవ్రస్థాయి ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు .నియోజకవర్గంలోని రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్, వ్యవసాయ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రమాదాలను ముందస్తుగా అంచనా వేసి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలన్నారు. అధికారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకూ స్థానిక నాయకుల సహకారంతో సహాయ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పి.మధుసూదనరావు, టిడిపి నాయకులు కొఠారి నాగేశ్వరరావు, పల్లపోతు వెంకటేశ్వర్లు, పాలపర్తి లక్ష్మినారాయణ, దొడ్డక చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కొప్పోలులో మురుగునీటి ప్రవాహ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల


సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఒంగోలు నగరంలోని టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మొత్తం 52 మంది లబ్ధిదారులకు రూ.60.99 లక్షల విలువైన చెక్కులు సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక సహాయం ఉపయోగించుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు నగర అధ్యక్షుడు బండారు మదన్, నగర మహిళాధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి, పఠాన్ హనీఫ్ ఖాన్, రామచంద్ర గౌడ్, కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, టిడిపి నాయకుల పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ అత్యవసర కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్లు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. మొంథా తుఫాను నేపథ్యంలో మంగళవారం నిర్వహించాల్సిన సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

పొగాకు బేళ్ల తిరస్కరణ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పొగాకు ధర కొంత మేర పెరిగినప్పటికీ కొనుగోళు తగ్గుతున్నాయి. సోమవారం రెండు రిజియన్ల పరిధిలో 5,186 బేళ్లను తిరస్కరించారు. మొత్తం 13021 బేళ్లను వేలానికి తెచ్చారు. అందులో 7,835బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 5,186 బేళ్లను తిరస్కరించారు. నల్ల రేగడి నేలల పరిధిలోని ఒంగోలు 1,2, వెల్లంపల్లి,టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 5,869 బేళ్లను వేలానికి తెచ్చారు. అందులో 3619 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాల చేత 2,250 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ 328, రూ కనిష్ఠ ధర రూ.69, పలికింది, సగటు ధర రూ. 200.79 పైసలు పలికింది. లైట్ సాయిల్ పరిధిలోని పొదిలి, కనిగిరి, కందుకూరు 1,2 కలిగిరి,డిసి పల్లి కేంద్రాల్లో 7,152 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 4,216 బేళ్లు అమ్మడు పోయాయి. వివిధ కారణాల చేత 2,936 బేళ్లను తిరస్కరించారు.కిలో పొగాకు గరిష్ట ధర రూ.328, కనిష్ఠ ధర రూ. 60, సగటు ధర రూ.193.71 పైసలు పలికింది.

కొండెక్కుతున్న కూరగాయల ధరలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

నిన్నటి వరకూ వరుస వర్షాలు. సోమవారం నుంచి మొంథా తుపాను పరిస్థితులు. వీటిని కూరగాయల వ్యాపారులు తమకు అనుకూలంగా మలచుకున్నారు. కూరగాయల ధరలను విపరీతంగా పెంచేశారు. నిన్నటి వరకూ కిలో రూ.25 అమ్మిన టమోటా ధర రూ.50 పెంచేశారు. కిలో రూ.40 అమ్మిన వంకాయలు, బెండకాయల ధర రూ.80 పెంచారు.రూ 60 అమ్మిన చిక్కుడు కాయల ధర రూ.80 నుంచి రూ.90 పెంచారు. మిర్చి, క్యారట్, బీట్ రూట్ ధర కిలో రూ.80 చేరింది.ఉల్లిపాయల ధర రూ.40 పెంచారు. కోడిగుడ్డు ధర కూడా కొండెక్కి కూర్చుంది. హోల్ సేల్ మార్కెట్‌లో ఒక గుడ్డు రూ.7 అమ్ముతున్నారు. చిల్లర దుకాణాల్లో రూ.8 విక్రయిస్తున్నారు. కూరగాయాల మార్కెట్‌తో పాటు రైతు బజారుల్లో ఈ రేట్లు కొనసాగడం గమనార్హం. తుఫాన్ ప్రారంభం కాకముందే ఈ పరిస్థితులు ఉంటే తుఫాన్ తీవ్రమయితే ధరలు ఇంకా పెరుగుతా యేమోనని గహిణులు వ్యాఖ్యానిస్తున్నారు.

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్ఒ శివలీల, బాపట్ల తహశీల్దారు సలీమ



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న పర్చూరు అధికారులు

ప్రజాశక్తి - బాపట్ల

కలెక్టర్ ఆదేశాల మేరకు తుఫాను పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తహశీల్దారు షేక్ సలీమా తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తుపాను పరిస్థితులపై తీసుకుంటున్న చర్యలను ప్రత్యేక అధికారి జి శివలీలతో కలిసి పర్యవేక్షించారు. మండలంలోని 20 గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైన ప్రజలు కేంద్రాల్లో రక్షణ పొందాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు చేర్చిన ప్రజలకు తాగునీరు, భోజన వసతి, మరుగుదొడ్లు, వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పరిశీలన

పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆర్ట్సుఅండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించినట్లు మునిసిపల్ కమిషనర్ జి రఘునాధరెడ్డి తెలిపారు. పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పునరావస కేంద్రానికి చేరన లోతట్టు ప్రాంతాల ప్రజలకు త్రాగునీరు, ఆహారం, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పర్చూరు : మండలంలో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని తహశీల్దారు పి బ్రహ్మయ్య సోమవారం పరిశీలించారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. తుఫాను ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలని చెప్పారు. మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, నిత్యవసర వస్తువులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పర్చూరులో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 32 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డిఇ సతీష్ చంద్ర, పంచాయతీ కార్యదర్శి మస్తానరావు, ఇన్చార్జి ఈఓపిఆర్డి హరిప్రసాద్, విఆర్ఒ శ్రీనివాసరావు, ఎస్ఐ జివి చౌదరి, ట్రైనీ ఎస్ఐ పి గోపి, వార్డ్ సభ్యులు షేక్ గౌస్ బాషా, మీరావాలి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరం జెడ్పి ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చసిన శిబిరంలో 75 మంది గిరిజనులను చేర్చారు. వారికి భోజన వసతి, విద్యుత్తు సౌకర్యం, మెడికల్ క్యాంపు, అధికారుల పర్యవేక్షణ వంటివి ఏర్పాటు చేశారు. ఐలవరంలో మాత్రమే ముందుగా శిబిరాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. గిరిజనులు, కాలువ కట్టలు, డొంకల్లో పూరి గుడిసెలు వేసుకొని నివాసం ఉంట్టున్న పేదలకు నష్టం జరగకుండా ముందస్తుగా తరలించినట్లు తహశీల్దారు మేక శ్రీనివాసరావు తెలిపారు. త్రాగునీటి కోసం వాటర్ టిన్నులు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్ అంతరాయం కలిగితే జనరేటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ తెలిపారు. ఐలవరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు శాంత లక్ష్మి, విఆర్ఒ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, హెచ్ఎం మాచర్ల మోహనరావు, అనగానీ ఏడుకొండలు ఉన్నారు.

ఇంకోల్లు : వర్షాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ముసురు పట్టే సూచనలు ఉన్నందున ఇంట్లోకి అవసరమైన నిత్యవసర వస్తువులు, కూరగాయలు మూడు రోజులకు సరిపడా ముందుగానే జాగ్రత్త చేసుకోవాలని తెలిపారు.

నిజాంపట్నం : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హెడ్క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి ఆదేశించారు. పునరావాస కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈప్రజలు, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి త్రాగునీరు, పరిశుభ్రత చర్యలు చూడాలని సూచించారు.



ఐలవరం కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి



మాట్లాడుతున్న నిజాంపట్నం ఎంపిడిఒ నాగలక్ష్మి

తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -పంగులూరు

మొంతా తుఫాను పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు శ్రీ చరణ్ కోరారు. ప్రజలు అవసరాన్ని బట్టి ఇళ్ల నుండి బయటకు రావాలని, ఈ రెండు రోజులు ఎక్కడికి ప్రయాణించవద్దని కోరారు. ఈపాటికే 4 గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చామన్నారు. ముప్పవరంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావసు కేంద్రంలో ఏడు కుటుంబాలకు చెందిన 20 మంది ఉన్నారని తెలి పారు. చందలూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఐదు కుటుంబాలకు చెందిన 25 మంది ఉన్నారని, పంగులూరు జెడ్పి ఉన్నత పాఠశా లలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 12 కుటుంబాలకు చెందిన 30 మంది, తూర్పుకొప్పెరపాడులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఐదు కుటుంబాలకు చెందిన 29 మంది ఉన్నారని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతులు, సదుపాయాలు కల్పించామని చెప్పారు. ఏదైన ఇబ్బంది ఏర్పడితే 9000811918 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

వాడరేవులో ఎమ్మెల్యే కొండయ్య పర్యటన

ప్రజాశక్తి - చీరాల

మొంథా తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. తీర ప్రాంత మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురికాకుండా ఉండాలని చెప్పారు. వాడరేవు, రామాపురం, కటారిపాలెం తీరప్రాంత గ్రామాలతో పాటు లోతట్టు ప్రాంతాలను ఆయన సందర్శించారు. తుఫాన్ ప్రభావంతో ఎవరూ ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేక పోలీసు బలగాలను పంపించడంతో పాటు అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 34 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిత్యావసర సరుకులు, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీజిల్, పెట్రోల్ నిల్వలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి వాతావరణ పరిస్థితులను గ్రామస్థులకు తెలియజేయాలని ఆదేశించినట్లు చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని చెప్పారు. పర్యాటకులు తాత్కాలికంగా సముద్రతీరానికి రాకూడదని సూచించారు. వాడరేవులోని పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. మత్స్యకారులు, ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తీర ప్రాంతంలోని లోతట్టు మత్స్యకారులకు రూరల్ సిఐ శేషగిరిరావు, ఎస్ఐ జనార్ధన్ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. డిఎస్పీ మోయిన్ తీర ప్రాతంలో భద్రతా సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఒ చంద్రశేఖర్ నాయుడు, తహశీల్దారు గోపికృష్ణ, ఎఎంసి చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



తీరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



ఆర్థిక సహాయం అందజేస్తున్న కార్యదర్శి వినయ్‌పాల్

పంచాయతీ కార్యదర్శి దాతృత్వం

ప్రజాశక్తి - కారంచేడు

వేటపాలెం మండలం కొత్తపేటలోని బిఆర్కె స్కూలులో 6వ తరగతి చదువుచున్న తిమిడితపాటి అజయ్ అనే విద్యార్థి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ గుంటూరులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా అతని వైద్యానికి మండలంలోని నాయుడువారిపాలెం పంచాయతీ కార్యదర్శి వినయ్‌పాల్ రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. సచివాలయం స్టాఫ్ ద్వారా, తన సహచర పంచాయతీ కార్యదర్శుల ద్వారా సేకరించి విద్యార్థి తల్లి తిమిడితపాటి సుప్రియకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లి దండ్రులు సుప్రియ, హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని తెలిసి తాను కూడా పలువురి ద్వారా ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు. పూర్తిగా నయమయ్యే అవకాశం ఉందని తెలిపారు. వైద్య ఖర్చులకు దాతలు సహకరించాలని కోరారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేటపాలెం

రైల్వే ట్రాక్ పక్కన గుడిసెల్లో నివసిస్తున్న అంబేద్కర్ నగర కాలనీ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బిఎస్‌పి ఇన్‌చార్జ్ చిట్టిమల సంగీతరావు డిమాండ్ చేశారు. బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుదే రాజారావు ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీలోని అంబేద్కర్ నగర్‌ను సోమవారం సందర్శించారు. రైల్వే ట్రాక్ అంచున పూరి గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని అన్నారు. వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి కటారి గోపి, కోశాధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు

ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి - కొల్లూరు

కొల్లూరుకు చెందిన టిడిపి కార్యకర్త చొప్పర నాంచారయ్య దురదృష్ట వశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. టిడిపి కార్యకర్తల ప్రధమ భీమా ప్రయోజనాలకు అవసరమైన పత్రాలు సేకరించి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయన భార్య చొప్పర స్వాతికి మంజూరైన రూ.5లక్షల భీమా చెక్కును శాసన సభ్యులు నక్క ఆనందబాబు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.



సూర్యలంకలో ఎస్డిఆర్ఎఫ్ బృందం

సూర్యలంక చేరిన ఎస్డిఆర్ఎఫ్ బృందం

ప్రజాశక్తి - బాపట్ల

మొంథా తుఫాను నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం కాకినాడ 3వ బెటలియన్ (ఎస్‌డిఆర్ఎఫ్) కు చెందిన 35 మంది బృందం సోమవారం సూర్యలంకకు చేరుకున్నారు.



సహాయక శిబిరాలను పరిశీలిస్తున్న అధికారులు

తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మొంథా తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా మండలంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లో నివాస వసతి లేని, కాలువ కట్టల వెంబడి గుడిసెల్లో నివసించే కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. పాఠశాలల్లో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. మండలంలోని తూర్పుపాలెం, ఆరుంబాకలో శిబిరం ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు సిహెచ్ పద్మావతి తెలిపారు. ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని, ఎస్ఐ అనిల్ కుమార్ పరిశీలించారు.

నీటిని బయటకు పంపాలి


ప్రజాశక్తి - వేమూరు

వర్షాలకు నేల వాలిన వరి పైరును కట్టలుగా కట్టి నిలబెట్టి పొలంలో నీటిని బయటకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలని ఎఒ ప్రేమ్ సాగర్ సూచించారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులతో సమావేశం నిర్వహించారు. అధిక వర్షాల నుండి పంటలను కాపాడుకునే పద్దతులు వివరించారు. పొలంలో మురుగు కాలువలు ఏర్పాటు చేసి వెంటనే నీటిని తీసివేయాలని చెప్పారు. కార్యక్రమంలో విఎఎలు శిరీష, షాహిన్, దీప్తి పాల్గొన్నారు.

నిజాం పట్నంలో...

మూడో నెంబర్ ప్రమాద సూచిక

నిజాంపట్నం : మొంథా తుఫాను ప్రభా వం అధికంగా ఉండటంతో అధికారుల ఆదేశాల మేరకు నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగర వేసినట్లు పోర్టు కన్జర్వే టర్ వెంకట నరసింహ మూర్తి తెలిపారు.



ప్రమాద సూచిక

ప్రజాశక్తి 7
మంగళవారం 28 అక్టోబర్ 2025

అప్రమత్తంగా ఉండండి : మంత్రి అనగాని

ప్రజాశక్తి - రేపల్లె



మంత్రి అనగాని సత్యప్రసాద్

సముద్ర తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై తుఫాన్ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు నైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం, ప్రజలతో ఉందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. అధికారుల సూచనలు తప్పక పాటించాలని అన్నారు. అప్రమత్తంగా ఉంటేనే సురక్షితంగా ఉండగలమని సూచించారు. వాతావరణ హెచ్చరికలు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. అధికారుల సూచన మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించారు. మత్స్యకారులు తుఫాన్ పూర్తిగా తగ్గే వరకు సముద్రంలో వేటకు వెళ్లవద్దని చెప్పారు. పడవలు, నౌకలు సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చే వరకు బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు, పాడైన భవనాలు, పెద్ద చెట్లు, బోర్డులు పడిపోయిన చోట జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున తాగునీటిని కాచుకుని లేదా ప్యాక్డ్ వాటర్ వాడాలని సూచించారు.

వర్షంలోనూ కేంద్రీయ విద్యాలయ నిర్వహణ

ప్రజాశక్తి - బాపట్ల



బస్సు కోసం వేచి ఉన్న కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు

మొంథా తుఫాను కారణంగా జిల్లాలో పాఠశాలలకు సెలవు ప్రకటిస్తే సూర్యలంక కేంద్రీయ విద్యాలయం మాత్రం యధాతధంగా కొనసాగుతోంది. జిల్లాలో మూడు రోజుల పాటు పాఠశాలలకు కలెక్టరు సెలవు ప్రకటించిన సంగతి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్‌కు తెలియదని, పిల్లలను విద్యాలయానికి యదాతధంగా పంపాలని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆర్టీసీ బస్సులు యధావిధిగా పంపాలని బాపట్ల ఆర్టీసీ డిఎంకు ఫోన్ ద్వారా ప్రిన్సిపల్ తెలిపినట్లు డిఎం తెలిపారు. మూడు రోజులు పాఠశాలలకు సెలవు ప్రకటించగా ప్రిన్సిపల్‌కు చెప్పినప్పటికీ తమకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని, బస్సులు పంపాల్సిందేనని అన్నారని, అందువల్లే బస్సులు నడుపుతున్నట్లు డిఎం వివరించారు. ఈ విషయమై డిఇఒ పురుషోత్తంను వివరణ కోరగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మూడు రోజులపాటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేస్తే కేంద్రీయ విద్యాలయం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. విద్యార్థులను విద్యాలయానికి పంపాల్సిందేనని ఫోన్ల ద్వారా మెసేజ్‌లు పంపేసరికి తప్పని పరిస్థితుల్లో పిల్లలను సిద్ధం చేసి పంపాల్సి వస్తోందని తెలిపారు. తుఫాను తాకిడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రచార ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తుంటే కేంద్రీయ విద్యాలయం నిర్వాహకులు మాత్రమే తమకు ఏ విధమైన సమాచారం లేదని, సెలవులు ప్రకటించిన సంగతి తెలియదని చెప్పడం విడ్డూరంగా ఉందని డిఇఒ తెలిపారు.

పిఇటి అసోసియేషన్ కోశాధికారిగా 'చేబ్రోలు'

ప్రజాశక్తి - భట్టిప్రోలు



శ్రీనివాసరావు సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పిడి, పిఇటి అసోసియేషన్‌కు 2025- 27 కు గాను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో భట్టిప్రోలు టీఎం రావు ఉన్నత పాఠశాల పిఈటి ఉపాధ్యాయులు చేబ్రోలు శ్రీనివాసరావు జిల్లా కోశాధికారిగా ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సి రామ కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు స్టేట్ అబ్జర్వర్‌గా వినయ్, పల్నాడు ప్రెసిడెంట్ స్వర్ణ రాజు, సెక్రటరీ ఖాదర్ మస్తాన్, శరత్, విష్ణు హాజరైనట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఎం సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి నారాయణ, కోశాధికారి భట్టిప్రోలు చేబ్రోలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు, హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ అత్తోట సుగుణ, కోటేశ్వరమ్మ, ఉమామహేశ్వరరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, మురళీధరరావు, సుబ్బారావు, లక్ష్మీపార్వతి, సత్యరత్న తదితరులు చేబ్రోలు శ్రీనివాసరావును శాలువాలతో సత్కరించి అభినందించారు.



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నీటికుంటకు మెట్ల నిర్మాణం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని గన్నవరం శివాలయం వద్ద సీనియర్ రొటేరియన్ చెన్నుపాటి బసవ రాములు, హైదరాబాద్ డెక్కన్ క్లబ్ ఆర్థిక సహాయంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో త్రాగు నీటి కుంటలోకి ఎక్కి, దిగడానికి మెట్లు ఏర్పాటు చేశారు. ఆర్ఐ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎన్వి రాంప్రసాద్ దంపతులు, డేర్ చైర్మన్ ఆర్సి రొటేరియన్ మురళి తిరుపతినేని, జి కిరణ్, పిడి జి శరత్ చౌదరి, రాంప్రసాద్, మార్టూరు రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, గోనుగుంట్ల రవికుమార్, రావి అంకమ్మ చౌదరి, జాష్టి వెంకట మోహనరావు, కొర్రపాటి కాజారావు, కొర్రపాటి సుబ్రహ్మణ్యం, షేక్ సైదా పాల్గొన్నారు.



పూడిక తీత పనులు పర్యవేక్షిస్తున్న టిడిపి నేతలు

సైడు కాలువలకు మోక్షం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

జాతీయ రహదారికి సైడ్ కాలువలు నిర్మించిన జాతీయ రహదారి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొద్దిపాటి వర్షానికే సర్వీస్ రోడ్డులో నీళ్లు పోయే మార్గం లేక స్టేట్ బ్యాంకు వద్ద నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. టిడిపి పట్టణ అధ్యక్షులు కామినేని జనార్దన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, తొండెపు ఆదినారాయణ స్పందించారు పెదకానా నుండి హీరో షోరూం వరకు సర్వీసు రోడ్డులోని సైడ్ కాలువల్లో పూడికతీత పనులు ఆదివారం ప్రారంభించారు. కాకోలు వెంకటేశ్వర్లు, కన్నెగంటి శ్రీనివాస్, సకల ఆంజనేయులు, మురికిపూడి సలోమన్ పనులు పరివేక్షించారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి

ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి - బాపట్ల

వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి మాట్లాడారు. నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలు ప్రైవేట్ పరం చేస్తే ప్రజలకు వైద్యం అందనంత దూరం అవుతుందని అన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం, చంద్రబాబు తన అనుయాయులకు కట్టబెట్టేందుకే ప్రైవేటు విధానాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుండి సంతకాలు సేకరణ చేపట్టామని అన్నారు. ప్రవేటీకరిస్తే ప్రజా ఉద్యమం చేపడతామని అన్నారు. సమావేశంలో సమాజ్వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ, బిఎస్పి అధ్యక్షులు గుదే రాజారావు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జి చార్వాక పాల్గొన్నారు.

చీరాల కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం

షోకాజ్ నోటీసు జారీ..?

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌పై కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు సోమవారం వచ్చిన ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని 25 సచివాలయాల్లో 25 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అన్ని సచివాలయాల్లో జెసిబిలు, ట్రాక్టర్లు, సామాగ్రి అందుబాటులో ఉండాల్సి ఉండగా కేవలం మూడు చోట్ల మాత్రమే సహాయక చర్యలకు కమిషనర్ ఏర్పాట్లు చేయడంతో కలెక్టర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలపై ప్రత్యేక దృష్టితో సమీక్షిస్తుంటే కమిషనర్ నిర్లక్ష్య ధోరణితో ఉన్నాడని అసహనం వ్యక్తం చేశారు. ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు సమన్వయంతో మునిసిపల్ డిఈ రఘురాం, ఎఇ రవికుమార్‌లకు బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

తీరానికి పర్యాటకులు రావొద్దు

ప్రజాశక్తి - నిజాంపట్నం

ప్రజల బద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ కె తిరుపతిరావు తెలిపారు. తీర ప్రాంతంలో సముద్రం వద్దకు ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. తుఫాను హెచ్చరికలతో హార్బర్ ఎస్టీ కాలనీలోని ప్రజలను అప్రమత్తం చేశారు. అక్కడ నివసించే కుటుంబాలు అందరిని పునరావస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధం

ప్రజాశక్తి - అద్దంకి : మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తహశీల్దారు జి శ్రీ చరణ్ అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. మండలంలోని 27 సచివాలయాల పరిధిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ డి రవీంద్ర తెలిపారు. **బాపట్ల :** పిట్లలవానిపాలెం జూనియర్ కళాశాల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు చందోలు ఎస్ఐ శివకుమార్ సోమవారం తెలిపారు.

రైతులకు ఉద్యాన అధికారి సూచనలు

ప్రజాశక్తి - సంతమాగులూరు : తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు మండలంలోని మక్కెన వారిపాలెం, కొమ్మాలపాడు గ్రామాల్లో పలు సూచనలు చేశారు. మార్టూరు డివిజన్ ఉద్యాన శాఖాధికారి బి హనుమంతు నాయక్ తమ సిబ్బంది రైతులతో కలిసి మాట్లాడారు. అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడడంతో అరటి, బొప్పాయి, మిరప పంటలు ముంపుకు గురై నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. 25 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా పిచికారి చేయాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ముందస్తు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - బాపట్ల

మొంథా తుఫాను ప్రభావంతో ఈ నెల 27, 28, 29 తేదీల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారధి అధికారును ఆదేశించారు. అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. విద్యుత్, త్రాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. తుఫాను నేపథ్యంలో ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఎంఎల్ఎ నరేంద్ర వర్మ సూచించారు. నియోజకవర్గంలోని మత్స్యకారులు వేటకు వెళ్లడం తాత్కాలికంగా నిలిపేయాలని అన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.



కుర్చీలు బహుకరిస్తున్న వాకార్స్ ప్రతినిధులు

కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో వైవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లోని ఆడిటోరియంకు 50 కుర్చీలు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ మురళీ మాట్లాడుతూ విద్యార్థినులు కింద కూర్చోవలసి వస్తుందని తెలిపిన వెంటనే స్పందించి కుర్చీలు అందజేసిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యం కోసం 50 కుర్చీలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో చారుగళ్ల గురుప్రసాద్, నారాయణమూర్తి, డాక్టర్ ఐ బాబూరావు, వైస్ ప్రిన్సిపాల్ రత్నప్రభ, డాక్టర్ కొండమ్మ, గుద్దంటి రమేష్, పుల్లయ్యనాయుడు, శ్రీను, రామారావు, తుకారాం పాల్గొన్నారు.



పునరావాస కేంద్రాన్ని సందర్శించిన వేణుగోపాలరెడ్డి

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన

ప్రజాశక్తి - రేపల్లె

మొంథా తుఫానును ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ప్రత్యేక అధికారి ఎం వేణుగోపాలరెడ్డి అన్నారు. పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. తుఫాను పునరావాస కేంద్రాల్లోని విభాగాలు, తాత్కాలిక నివాసం ద్వారా తీర ప్రాంత ముంపు బాధితులకు తక్షణ భద్రత, ఆరోగ్య పరిరక్షణ, ఆహార భద్రత కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యంత పరిశుభ్రంగా ఉండేటట్లు తీర్చిదిద్దాలని అన్నారు. బాధితులు నివాసం ఉండే ప్రాంగణం, గదులను కుటుంబాల అవసరానికి అనుగుణంగా ఉంచాలని అన్నారు. వంటశాల పరిశుభ్రంగా నిర్వహించాలని అన్నారు. ఉచితంగా ఆహారం, సురక్షిత తాగునీరు, పిల్లలకు పాలు సరఫరా చేయాలని అన్నారు. తాత్కాలిక టాయి లెట్లు, శానిటేషన్ పూర్తిస్థాయిలో కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఎన్ రామలక్ష్మి, తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు పాల్గొన్నారు.

తుపాను ఎదుర్కొనేందుకు

అన్ని ఏర్పాట్లు సిద్ధం : ఎస్పి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మొంథా తుపాను నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులలైనా సమర్థ వంతంగా ఎదుర్కొని, ప్రాణ నష్టం సంభవించకుండా ప్రజలకు భద్రత కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి తుపాను సహాయక చర్యలు మరియు భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కంట్రోల్ రూమ్ (డయల్ 100 / 112) 24/7 పనిచేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫోన్ కాల్‌ను అత్యంత శ్రద్ధతో ఆలకించి తక్షణమే స్పందించాలని ఎస్పి ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా వచ్చే లైవ్ ఫీడ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రమాదకర పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తీర ప్రాంత భద్రత దష్ట్యా జిల్లాలోని పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్పి వారు నిర్వహించాల్సిన విధులు, సమన్వయ విధానాలపై స్పష్టమైన సూచనలు చేశారు. ఎస్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక, రెవెన్యూ మరియు విద్యుత్ శాఖల అధికారులతో నిత్యం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు సజావుగా సాగేలాగా చూడాలని సూచించారు. లైఫ్ జాకెట్లు, రోపులు, కట్టర్లు, జెసిబిలు, క్రేన్‌లు, ట్రాక్టర్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉన్న ప్రజలను కలిసి తుఫాను పరిస్థితులపై అవగాహన కల్పించి, ప్రభుత్వం సూచించే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అదేవిధంగా వాగులు, కాలువలు, చప్టాలు, నదులు ఉప్పొంగి ప్రవహించే సందర్భాల్లో కరకట్టలు తెగే అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడానికి హ్యాండ్ మైకులు సిద్ధం చేశారు. ఎస్పి వెంట ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్పి హర్షవర్ధన్ రాజు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్లకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

'మొంథా' తుపాను నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ, ఆస్తి కష్టాలు కలుగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. 'మొంథా' తుపాను ముప్పు నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై దిశా చేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీవ్ర తుఫానుగా మారి ఈనెల 28, 29 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిచేఅవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి కష్టాలు కలుగకుండా తగిన ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. శాఖలు వారిగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వర్చువల్ సమావేశంలో కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు, సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా : మొంథా తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి తుఫాన్ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తుఫాను ప్రభావం ఎక్కువ ఉన్న గ్రామాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. తుఫాన్ ను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పడిపోయిన చెట్లను తొలగించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందుబాటులోఉంచుకోవాలన్నారు. జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియ జేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బాపట్ల పట్ల జిల్లా కలెక్టరేట్ నుంచి తుఫాన్ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి.జి.గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సిఎం వర్చువల్ మీటింగ్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పి హర్షవర్ధన్‌రాజు


బాపట్లలో వీక్షణ సమావేశంలో పాల్గొన్న తుపాన్ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వేణుగోపాల్ రెడ్డి

తుపాను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

మొంథా తుపాను నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర సమాచార, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. కలెక్టరేట్‌లో పాత్రికేయులతో ఇన్‌ఛార్జి మంత్రి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాను కారణంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత రెండు రోజుల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుఫాను పరిస్థితులను ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. తుఫాను కాకినాడ -విశాఖపట్నానికి సమాన దూరంలో కేంద్రీకతమై ఉందన్నారు. తుఫాను తీవ్రత కోనసీమ ప్రాంతంలో ఎక్కువగా ఉంటుందని, ఆ ప్రాంతంలో తీరం దాటుతుందని వాతావరణ శాఖ అంచనాలు ఉన్నట్లు తెలిపారు. తుఫాను సహాయ చర్యలు చేపడానికి ప్రభుత్వం రూ.19 కోట్ల నిధులను ఇప్పటికే మంజూరు చేసినట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులను మంజూరు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో తుఫాను పరిస్థితులను ఎదుర్కోవడానికి ఎన్‌డిఆర్ఎఫ్ బలగాలలు, క్విక్ రెస్పాన్స్ బందాలను ప్రభుత్వం ఇప్పటికే తీరప్రాంత మండలాలకు పంపినట్లు తెలిపారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలలో సహాయ చర్యలు చేపడానికి అవసరమైన పరికరాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు సిద్ధం చేసినట్లు తెలిపారు. తుఫాన్ వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా డీజిల్ ఆయిల్, పెట్రోల్ నిల్వలు ఏర్పాటు చేయాలన్ని యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పాఠశాలలు, విద్యాసంస్థలకు మూడు రోజులు సెలవు దినాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తుఫాను ప్రభావం వల్ల జిల్లాలో మంగళవారం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. తీరం వెంబడి 100 నుంచి 120 కిలోమీటర్ల మేర ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి 470 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెప్పారు. ఈ సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, ఎస్పి బి.ఉమామహేశ్వర్, తుఫాను పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతన్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి

ఎఎంసిల బలోపేతానికి కృషి : దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వ్యవసాయ మార్కెట్ కమిటీల బలోపేతానికి కొత్తగా ఎన్నికైన ఛైర్మన్లు కృషి చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పిలుపునిచ్చారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ప్రకాశం జిల్లాలోని ఎఎంసి ఛైర్మన్లు సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు ఒంగోలు ఎఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో లేని ఐదేళ్ళ కాలంలో మీరంతా ఎంతో కష్టపడ్డారన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేల సిఫారసు మేరకు పార్టీ కోసం కష్టపడిన వారిని ఎఎంసి ఛైర్మన్లుగా ప్రభుత్వం నియమించిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఉఎంసిలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని,రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. అప్పటి పాలకులు ఎఎంసిల నిధులను దారి మళ్లించారన్నారు. ఎఎంసిలు ఆదాయ వనరులు పెంచేలా ఛైర్మన్లు ఆలోచించాలన్నారు. తద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఛైర్మను అందరూ కలసి ఒకచోట చేరి వారి ఆలోచనలను పంచుకుంటే అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. సరైన ప్రణాళికలు రూపొందించుకొని ఎఎంసిలను అభివృద్ధి చేయాలన్నారు. తద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించాలన్నారు. దీంతో ప్రజల హృదయాలలో నిలిచిపోతారని తెలిపారు. ఒంగోలు ఎఎంసి ఛైర్మన్ పదవి కోసం ఎన్నో ఒత్తిళ్ళు వచ్చాయని, రాచగర్ల వెంకట్రావు గత ఎన్నికలలో పార్టీ కోసం కష్టపడి పనిచేయటంతో ఆయనను ఛైర్మన్‌గా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎఎంసి ఛైర్మన్లుగా మిమ్మల్ని సిఫారసు చేసిన ఎమ్మెల్యేలకు మంచి పేరు తీసుకురావాలని, ఎఎంసిలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే దామచర్ల ఆకాంక్షించారు. ఒంగోలు ఎఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన ఎఎంసి ఛైర్మన్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించామని, ఇందులో 10 ఎఎంసి ఛైర్మన్లు పాల్గొన్నారన్నారు. గత ఐదేళ్ళ కాలంలో ఎఎంసిలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని, రైతులకు ఎలాంటి సాయం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఛైర్మన్లుగా తమకు అవకాశం కల్పించారని, అందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం ఒంగోలు ఎఎంసి ఆవరణలో ఎమ్మెల్యే దామచర్ల మొక్కలు నాటారు. తరువాత ఎమ్మెల్యే దామచర్లను ఎఎంసి ఛైర్మన్లు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సమావేశంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జిల్లాలోని 10 మంది ఎఎంసి ఛైర్మన్లు, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షుడు బండారు మదన్, నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల